# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 09 జనవరి , 2026 | పేజీలు :08


## మిగిలి ఉన్న పనులు తక్షణమే పూర్తి చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మామడ:**మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న సదర్మాట్ బ్యారేజీకి సంబంధించిన మిగిలి ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ సదర్మాట్ బ్యారేజీని పరిశీలించారు.త్వరలో బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో,కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు.ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాటు సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఇప్పటివరకు చేపటిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్,రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యారేజీ ఆయకట్టు మీద రహదారి పనులు పూర్తి చేయాలని తెలిపారు.బ్యారేజీ నిర్మాణం దా దాపు పూర్తయిందని,మిగిలి ఉన్న పనులను కూడా ఆలస్యం లే కుండా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ సాయి కిరణ్,అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమా ర్,ఆర్డీఓ రత్నకళ్యాణి,నీటిపారుదల శాఖ అధికారులు,తహసిల్దార్ శ్రీనివాస్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నీళ్లపేరుతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**నీళ్ల పేరుతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలపై చర్చ జరగకుండా కాంగ్రెస్ , అవినీతిపై విచారణ లేకుండా బిఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తిలోని శుభం గార్డెన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో బిఆర్ఎస్ తీరుపై ఉద్యమం చేసింది బిజెపియేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏనాడైనా ఉద్యమాలు చేసిందా? అని ప్రశ్నించారు. తెలంగాణకు నీళ్ల అన్యాయం చేసిన మొట్టమొదటి దోషి కాంగ్రెస్సేనన్నారు. ఉమ్మడి ఏపిలో క్రిష్ణా వాటాలో 811 టిఎంసిలుంటే ఏనాడూ తెలంగాణకు 200 టిఎంసిలకు మించి నీటిని వాడుకోకుండా ఇక్కడి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. గోదావరిలో 1486 టిఎంసిల నీటి వాటా ఉంటే తెలంగాణలో ఎన్నడూ 500 టిఎంసిలకు మించి వాడుకోలేదన్నారు. రాష్ట విభజన యాక్టులోనూ తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని, ఏపి పునర్విభజన యాక్ట్ సెక్షన్ 89 ప్రకారం రాష్ట్ర విభజన నాటికి నిర్మాణంలో ప్లాన్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులపై అభ్యంతరం తెలపొద్దని స్పష్టంగా ఉందన్నారు. పునర్విభజన బిల్లు ఏపిలోని 4, తెలంగాణలోని 2 ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పొందుపర్చారని, తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. పునర్విభజన యాక్టులోని సెక్షన్ 89లో పాలమూరు ప్రస్తావనే లేనప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారని ప్రశ్నించారు. వైఎస్ పాలనలో పోతిరెడ్డిపాడు ద్వారా ప్రతిరోజు సగటున 4 టీఎంసిల నీటిని ఏపికి తరలిస్తే ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో పదేళ్ల కెసిఆర్ పాలనలో తెలంగాణకు మరణ శాసనమైందన్నారు. నీళ్లు, నిధులు నియామకాలనే ట్యాగ్‌లైన్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, కెసిఆర్ సీఎం అయిన కొత్తలో తెలంగాణకు కెసిఆర్ అనే అణుబాంబు ఉంది.. ఏపికి కెసిఆర్ అమ్ముడుపోయి అపెక్స్ కౌన్సిల్ సాక్షిగా 299 టిఎంసిల నీళ్లు చాలని చేసిన సంతకం చేశాడని స్పష్టం చేశారు. కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల క్రిష్ణా నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రం అనేక సార్లు హెచ్చరించిందని, నీళ్ల విషయంలో పాలకుల తప్పిదాలను సరిదిద్దడానికి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లను ఏర్పాటు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కెసిఆర్ పాలనలో ఏపి ప్రభుత్వం అక్రమంగా సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో దక్షిణ తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఇప్పటికైనా సరిదిద్దాలని, అందుకోసం కలిసి రావాలని కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను కోరారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతిపై సిబిఐ విచారణ జరపాలని రేవంత్‌రెడ్డి ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులు చేసిన అన్యాయంపై అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలకు అవకాశం సైతం ఇవ్వడం లేదన్నారు. మాజీ మేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు ప్రవీణ్‌రావు తదితరులున్నారు.

## పాఠశాల అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజా పక్షం/పెద్దపల్లి రూరల్ :**పాఠశాల అభివృద్ధి పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి గ్రామం లో ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉషన్నపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, తారుపల్లి, పందిళ్ళ, మిర్జంపేట , మెట్ల పల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, పెద్దరాత్ పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,అంగన్వాడి కేంద్రం, పల్లె దవాఖాన, శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్, నిర్మాణంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయ పనులను, మెట్ల పల్లి డిసిఎంఎస్ , శ్రీరాంపూర్ ప్యాక్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మంజూరు చేసిన ప్రహరి గోడలు , పాఠశాల పెయింటింగ్ పనులు వేగవంతం చేస్తూ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గేటు నిర్మాణ పనులు, ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్ పనులు నెల రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంటర్ లాకింగ్ టైల్స్ పనులు 40 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్స్ ను వినియోగంలోకి తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిర్జంపేట పాఠశాలల వంట గదిలో ఎగ్జిట్ ఫ్యాన్ , లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పెదరాత్ పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం వద్ద నిరుపయోగంగా ఉన్న గదిని ఉపయోగంలోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ కార్యాలయపు పెండింగ్ పనులు పూర్తి చేసి జనవరి 26 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో రైతులకు అవసరమైన మేర యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎవరు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీరాంపూర్ మండలంలోని గోదాములను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో కే.రామ్మోహన్, మండల విద్యాధికారి మహేష్ ,మండల పంచాయతీ అధికారి ఆరిఫ్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పవన్, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## గురుకులంలో శాడిజం..

విద్యార్థినుల కన్నీటి తిరుగుబాటు..*రోడ్డుపై బైఠాయించి నిరసన..
*బూతు పురాణం విప్పిన ఇంగ్లీష్ టీచర్...
*ఏడాదిగా కొనసాగుతున్న వేదింపులు..



**ప్రజాపక్షం/ఎడపల్లి:**అక్షరాలు దిద్దించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఒక ఉపాధ్యాయురాలు రాక్షసత్వంతో వ్యవహరిస్తూ విద్యార్థినుల పాలిట యముడిలా మారింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజ్‌లో ఇంగ్లీష్, పీజీటీ టీచర్ రజిని సాగిస్తున్న మానసిక వేదింపుల పర్వం ఒక్కసారిగా పేలింది. సహనం నశించిన విద్యార్థినులు రోడ్డెక్కి నిరసన తెల్పడం స్థానికంగా సంచలనం సృష్టించింది. చదువుకోవడానికి వచ్చిన ఆడ పిల్లలను కన్నబిడ్డల్లా చూడాల్సిందిపోయి, సదరు ఉపాధ్యాయురాలు తన పదజాలంతో విద్యార్థినుల మనోభావాలను ముక్కలు చేస్తుంది. ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థినుల కథనం ప్రకారం.. గత ఏడాది కాలంగా రజిని అనే టీచర్ అత్యంత నీచమైన పదజాలంతో దూషిస్తుందని, కుక్క జాతి, బర్రె జాతి, బిచ్చగాళ్లు, పనికి మాలిన మంద అంటూ విద్యార్థినుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాటలతోనే కాకుండా తోటి విద్యార్థినుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాటలతోనే కాకుండా, తోటి విద్యార్థినులు, స్టాఫ్ ముందే అవమానిస్తూ వారిని మానసిక క్షోభకు గురి చేస్తుందని ఆరోపించారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినులను లక్ష్యంగా చేసుకొని భౌతిక దాడులకు సైతం పాల్పడుతోందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. టీచర్ వేదింపులు భరించలేక, న్యాయం కోసం విద్యార్థినులు గురువారం కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. అక్కడితో ఆగక బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే విషయం బయటకు పొక్కకుండా చూసేందుకు కళాశాల సిబ్బంది గేట్లు వేసి విద్యార్థీనులను లోపలే బందించే ప్రయత్నం చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థి సంఘాల నేతలు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. ఈ వివాదంపై ప్రిన్సిపల్ గంగా శంకర్ స్పందిస్తూ తాను సెలవులో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే టీచర్‌ను సెలవుపై పంపినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. గురుకులాల్లో రక్షణ కరువవుతోందని విద్యార్థీనుల మనోస్థితిని దెబ్బతీసే ఇలాంటి ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థకే కళంకమని, ఉపాధ్యాయురాలు రజినిపై కేవలం సెలవు వేటు వేస్తే సరిపోదని, తక్షణమే ఆమెను విధుల్లో నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన విద్యా వ్యవస్థలో ఇలాంటి శిక్షా రాక్షసులు ఉండటం ఆందోళనకరమని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆ విద్యార్థినులకు న్యాయం చేయాల్సిన అవసరం ఏంతైనా ఉందని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీ కిట్ అందజేశారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 33 ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేక సిలబస్ ద్వారా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. యూనిఫాం, పుస్తకాలతో పాటు ప్రీ ప్రైమరీ చిన్నారులకు ఉచితంగా షూ అందజేస్తామన్నారు. పిల్లల నమోదు, హాజరు పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. పర్లపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. 3వ తరగతి విధ్యార్థులతో పాఠాలు చదివించారు. బుధవారం బోధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సూరం స్వప్న, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం మంజుల తదితరులున్నారు.

## ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల సందర్శన

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాల తరగతి గదులను,డైనింగ్ హాల్, కంప్యూటర్‌గది, హాస్టల్ తదితర వసతులను పరిశీలించారు. విద్యార్థులు ఏయే రంగాల్లో ఉత్సాహంగా ఉన్నారో వాటిలో శిక్షణ ఇప్పించేందుకు ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. సంగీతం, గానంలో మరింతగా శిక్షణ ఇవ్వాలని మ్యూజిక్ టీచర్‌కు సూచించారు. పెయింటింగ్స్, అల్లికలు వంటి కళల్లో రాణిస్తున్న వారికి వివిధ సదుపాయాలు కల్పించాలని, అవసరమైన మెటీరియల్ సమకూర్చాలన్నారు. బధిర విద్యార్థులు సైతం విభిన్న రంగాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్, కంప్యూటర్ రంగంలో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, ప్రిన్సిపల్ భాస్కర్, సంగీత ఉపాధ్యాయిని సరళ పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్‌లోని సిద్దార్థ విద్యాసంస్థలలో అంగరంగ వైభవంగా కన్నులపండుగగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని రంగురంగుల రంగవల్లులతో, మామిడి తోరణాలతో అలంకరించారు. పాఠశాల చైర్మన్ దారసి శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. గోదాదేవి, హరిదాసులు, జంగమదేవరులు, గంగిరెద్దులవారి వేషధారణలతో విధ్యార్థులు ఆకట్టుకున్నారు. గోదాదేవింగ నాయకుల కల్యాణం జరిపించారు. పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు విధ్యార్థులకు తెలియజేయవచ్చునన్నారు.

## జన్మ లోపాలు ఉన్న పిల్లల వివరాలను నమోదు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జన్మలోపాలు ఉన్న పిల్లల వివరాలను తప్పక నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం రోజునజిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో ఆర్.బి.ఎస్.కె (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) డాక్టర్లు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశం నిర్దేశించి ఆయన మాట్లాడుతూ ఆర్.బి.ఎస్.కె కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు మరియు సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ప్రతిరోజూ హాజరును పర్యవేక్షిస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు సంపూర్ణంగా స్క్రీనింగ్ నిర్వహించి, రిఫరల్ కేసులను పెంచాలని సూచించారు. జన్మ లోపాలు ఉన్న పిల్లల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, పాఠశాలల్లో జరుగుతున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు.షెడ్యూల్ ప్రకారం పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని తెలిపారు.అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా పాల్గొని, సంబంధిత వైద్య అధికారులు సూచించిన డయాగ్నొస్టిక్ పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించి సకాలంలో టిహబ్ పెద్దపల్లి కి పంపాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చేయుటకు సౌకర్యం గల పరీక్షలను అక్కడే నిర్వహించాలని తెలిపారు. స్టాక్ రిజిస్టర్ మరియు ల్యాబ్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. బి. శ్రీరాములు, డా. బి. కిరణ్ కుమార్, డా. కె.వి. సుధాకర్ రెడ్డి, టి. రాజేష్ (ఎం.పి.హెచ్.ఈ.ఓ.)తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి భూమి కేటాయింపు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని 15 గుంటల భూమిని కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ శాశ్వత భవన నిర్మాణానికి కేటాయిస్తూ యూనివర్సిటీ ఎగ్జిగ్యూటివ్ కౌన్సిల్( కార్యనిర్వాహక మండలి) నిర్ణయం తీసుకున్న ట్లు యు.ఉమేష్ కుమార్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 2 4న జరిగిన 84వ ఎగ్జిగ్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు తీర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. మల్కాపూర్ జం క్షన్ నుంచి చింతకుంట వెళ్లే రహదారిలో యూనివర్సిటీ వె స్ట్ గేట్ (పడమద్వారం) పక్కన ఉన్న 15 గుంటల స్థలాన్ని ఈ భవన నిర్మాణం కోసం కేటాయించామని ఆయన తెలిపారు. ఈ సంధర్భంగా దీనికి సంబంధించి అధికారికంగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసి)ను కరీంనగర్ సిపికి అందజేసినట్లు విసి వివరించారు. సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో కరీంనగర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణను మరింత మెరుగుపరచడం కొరకు యూనివర్సిటీలో కొత్తపల్లి పోలీసు స్టేషన్ శాశ్వత భవన నిర్మాణం, నిర్వహించడం ప్రజలకు మరింత సేవలందించేందుకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. విసికి సిపి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌యు రిజిస్ట్రార్ సతీష్ కుమార్, డా.హరికాంత్, కంట్రోలర్ డి.సురేష్‌కుమార్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపి విజయకుమార్, ఇన్స్‌పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐ సాంబమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ట్రినిటీలో ‘మేధా 2కె26’



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లోని ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంబిఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ‘మేధా 2కె26’ పేరుతో నిర్వహించనున్న నేషనల్ లెవెల్ ఇంటర్ కాలేజెస్ యూత్ ఫెస్టివల్ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఘనంగా ప్రారంభం కానుందని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ యూత్ ఫెస్టివల్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న అండర్ గ్రాడ్యుయేషన్ విధ్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఎంబిఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ నాగేందర్ సింగ్ తెలిపారు. ఈ యూత్ ఫెస్టివల్‌లో విధ్యార్థుల సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, మేధస్సును వెలికితీసే విధంగా వివిధ రకాల టెక్నికల్ గేమ్స్, ఫన్ గేమ్స్, మేధోపరమైన పోటీలు, ఆసక్తికర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే మంచి స్పందన లభించిందని, ఇప్పటివరకు సుమారు 2500 మంది విధ్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విధ్యార్థులకు బహుమతులు అందజేయనున్నారు. అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఓవరాల్ విజేత కళాశాలకు ప్రత్యేక ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**ప్రజాపక్షం /సుల్తానాబాద్:** వాహనదారులు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ, ట్రాఫిక్ పోలీస్, జిల్లా రవాణా అధికార సంస్థ సంయుక్తంగా స్థానిక కోర్టు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి, హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడుపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించ వచ్చని సూచించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వు అందించి అభినందించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు హెల్మెట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఏజీపీ దూడం ఆంజనేయులు, జిల్లా రవాణా అధికారి రంగారావు, మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ శివ స్వప్న, మసూద్ ఆలీ, ట్రాఫిక్ సిఐ అనిల్, పోలీస్ సిఐ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్, న్యాయవాదులు మాదూరి ఆంజనేయులు, ఒడ్నాల రవీందర్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివ కృష్ణ, రవి కిరణ్ , స్నేహ, పృధ్వీ , పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

**ప్రజా పక్షం/సుల్తానాబాద్:**పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి కుల బాంధవుడు దూడం వెంకట సాంబమూర్తి ను పెద్దపెల్లి జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటరుగా నియమించిన సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం అడక్ కమిటీ చైర్మన్ వలస నిలయ ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బత్తుల రమేష్ ,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఆడెపు సుధాకర్,జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యనిర్వాహణాధ్యక్షులుకోమటిపల్లి సదానందం,పూసల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వెంకన్న,పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కాలేజీలో ఘనంగా కామర్స్‌మీట్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్‌లోని కెమిస్ట్ భవన్‌లో అల్ఫోర్స్ ఉమెన్ డిగ్రీ పిజి కాలేజీ, కరీంనగర్ కామర్స్ క్లబ్ ట్రేడ్ టైటాన్స్ ఆద్వర్యంలో నిర్వహించిన తొలి కామర్స్ మీట్ ‘ సినర్జీ’ పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగ అధిపతి డా.డి.హరికాంత్ ముఖ్య అతిధిగా హాజరైనారు. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ పిజి కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ముఖ్య అతిధిగా హాజరైన డా.హరికాంత్ మాట్లాడుతూ వాణిజ్య విద్య ప్రస్తు అవసరం, భవిష్యత్తు అవకాశాలపై ప్రేరణాత్మక సందేహాన్ని అందించారు. కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విధ్యార్థుల్లో వాణిజ్య విజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడినాయని తెలిపారు. ఈ సంధర్భంగా జిఎస్‌టి ప్రభావం, భారతదేశంలో క్యాష్ లెస్ ఎకానమీ, ఈ కామర్స్ పాత్ర, వ్యాపార నమూనాల రకాలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించగా, విధ్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహాన్ని నింపాయి. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## 40వ వార్షిక క్రీడా వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో 40వ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2026ను నర్సరీ నుంచి మూడో తరగతి విధ్యార్థులతో అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ‘ ఉడాన్ మీ కలలకు రెక్కలు ఇవ్వండి ’ అనే థీమ్‌తో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కరెస్పాండెంట్ లీనా ప్రియదర్శిని నాయకత్వంలో చైర్మన్ రాజ్‌కుమార్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. వారు క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. రన్నింగ్ రేస్, సాక్ రేస్, ఫ్రాగ్ జంప్, స్కిప్పింగ్, మ్యూజికల్ చెయిర్స్, కోన్ బ్యాలెన్సింగ్, రిలే రేస్, స్పైడర్ వాక్, బెలూన్ బ్యాలెన్సింగ్, త్రీ లెగ్డ్ రేస్ వంటి అనేక క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. విద్యార్థుల ఉత్సాహభరితంగా పాల్గొనడం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి.

## ప్రభుత్వ ప్రీప్రైమరీ విద్యార్థులకు వన్ హాస్పిటల్స్ చేయూత

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ (నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి) విభాగాల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆద్వర్యంలో ప్రారంభమైన ఈ చిన్నారి విద్యావంతుల కోసం వన్ హాస్పిటల్స మేనేజింగ్ డైరెక్టర్ డా.మహేష్ రెడ్డి మర్రి జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన 250 స్టేషనరీ కిట్లను కలెక్టర్ ప్రశంసించారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ విద్యాసామాగ్రిని విధ్యార్థులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విధ్యార్థుల నమోదును ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ చైర్మన్లు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులతో సమీక్షించారు. వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, షామియానాకు, క్యూలైన్లు, బారికేడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఆహార వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో సుధాకర్, ఆలయ అర్చకులు నాగరాజు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/గంగాధర:**మండలంలోని అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్(బాబాసాహెబ్ అంబేద్కర్)ను గురువారం మండల తహసీల్దార్ అంబటిరజిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న, సీనియర్ దళిత నాయకులు ద్యావ శ్రీనివాస్, ద్యావ సంజీవ్, చిలుముల రాజయ్య, పొత్తూరి సురేష్, గంగాధర రాజయ్య,లక్ష్మి దేవిపల్లి సర్పంచ్ లున్నారు.

# సర్పంచ్ తీరుపట్ల వార్డు సభ్యుల ఆగ్రహం



**ప్రజాపక్షం/ముత్తారం :** మొదటి మీటింగ్ లోనే పూర్తిస్థాయిలో పాలకవర్గం వార్డు సభ్యులు లేకుండా మెజారిటీ వార్డు సభ్యులతో కార్యదర్శి తో తీర్మానాలు చేయడం పట్ల సర్పంచి తీర్పట్ల వార్డు సభ్యులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామంలో నూతనంగా సర్పంచ్ గా గెలిచిన రాజయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య ఆధ్వర్యంలో 10 గంటల 20 నిమిషాలకు మొదలైన ప్రథమ బాడీ మీటింగ్ ఉప సర్పంచ్ కలవేన సమ్మక్క తోపాటు మరో ముగ్గురు వార్డు సభ్యులతో మొదలైన బాడీ సమావేశం కేవలం 10 నిమిషంలోనే పలు తీర్మానాలు చేసుకొని బాడీ మీటింగ్ ముగించడం పట్ల బాడీ మీటింగ్ కొద్దిగా ఆలస్యంగా సమావేశానికి వచ్చిన వార్డు సభ్యులు దొడ్ల కమలాకర్, రాపెల్లి స్రవంతి, రాములు, మొగిలి సభ్యులు సర్పంచ్ ఏకపక్ష తీర్మానాలు చేయడం పట్ల అసహనం వ్యక్తం అసహనం వ్యక్తం చేస్తూ.. ఇదే విషయంపై వార్డు సభ్యులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో సురేష్ ని వార్డు సభ్యులు కలిసి మొదటి మీటింగ్ కే సభ్యులందరూ లేకుండా సర్పంచ్, కార్యదర్శితో ఇలా తీర్మానాలు చేయడం సరికాదని ఎంపీడీవోకి వివరించారు. దీనికి ఎంపీడీవో స్పందిస్తూ మరో మారు ఇలా కాకుండా చూస్తామని వార్డు సభ్యులకు హామీ ఇచ్చారు.

## మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత



**ప్రజాపక్షం/చొప్పదండి:**పట్టణ పరిధిలోని 13వ వార్డుకు చెందిన భూపతి చంద్రకళ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని గురువారం నిజానపునం చందు మిత్రమండలి పరామర్శించారు. 50 కిలో బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, గుంటి ఎల్లయ్య, పెద్దిభీమ లింగం, జక్కుల అనిల్‌కుమార్, జనార్దన్, అనుముల మహేష్‌లు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**అల్లునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ గ్రామ పంచాయతీలోని మహిళలకు ముగ్గుల పోటీలు కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామ సాంప్రదాయాలను, కళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఆవుదుర్తి రామ్ కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించగా గ్రామ పంచాయతీ ప్రాంగణంలో ముగ్గులు రంగురంగుల హరివిల్లును తలపించాయి. ఈ సంధర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ పల్లెటూరి సంస్కృతిని కాపాడుకోవడంలో మహిళల పాత్ర అమోఘమని, ఇలాంటి పోటీలు గ్రామస్తుల మధ్య ఐక్యతను పెంపొందిస్తామయని కొనియాడారు. పారమిత పాఠశాల చైర్మన్ ప్రసాద రావు మాట్లాడుతూ విధ్యార్థులు చదువుతో పాటు మన మూలాలను సాంప్రదాయాలను గౌరవించాలని, ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లోని సృజనాత్మక బయటకు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు సర్పంచ్ రామ్ కిషన్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఉపసర్పంచ్ పోచయ్య, వార్డు మెంబర్లు , మహిళా సంఘాల సిఏలు, పారమిత స్కూల్ డైరెక్టర్లు ప్రసూన, వియుయం ప్రసాద్, ప్రిన్సిపల్ ఎం.శ్రీకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకనుగుణంగా పండుగలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**సంక్రాంతి సంబరాలలో భాగంగా గురువారం రోజున పెద్దపల్లి టిఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్ (కలెక్టరేట్) లో డిపార్ట్మెంట్ ల మధ్య రంగవల్లుల పోటీలు నిర్వహించడం జరిగిందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బొంకురి శంకర్ తెలిపారు.మహిళా ఉద్యోగులందరూ ఆసక్తిగా పాల్గొని తమ సృజనాత్మకతను, తమ డిపార్ట్మెంట్ కి చెందిన ప్రత్యేకతను జోడించి అద్భుతంగా రంగవల్లులను తీర్చిద్దారనీ, పోటీలలో ప్రథమ బహుమతి నగదు బహుమతిని ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ గెలుచుకోగా, ద్వితీయ బహుమతిగా నగదు బహుమతిని సివిల్ సప్లయిస్ డిపార్ట్మెంట్ గెలుచుకోగా, తృతీయ బహుమతి గా నగదు బహుమతిని డిఆర్ డీ ఏ డిపార్ట్మెంట్ గెలుచుకున్నారని, బహుమతులను జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా విజేతలకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు మరియు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జే ఏ సీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ప్రతి పండుగను ఇలా జరుపుకుంటూ మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నారని, ఒక్క పిలుపుతో ఉద్యోగులు ఇలా కలిసిరావడం సంతోషకరంగా ఉందని, ఈ స్ఫూర్తిని తన నాయకత్వానికి మరింత బాధ్యత పెంచుతుందని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రకాష్, పిఏఓ ప్రభాకర్, డీ ఈ ఓ శారద, జిల్లా సహా అధ్యక్షులు అనిత, కోశాధికారి ఆడెపు శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు శ్రీ అయిరెడ్డి సందీప్ రెడ్డి గారు, కార్యదర్శి శ్రీ ప్రవీణ్ గారు, స్వప్న, శ్రీధర్,విష్ణు, రవి, శ్రీనివాస్,శిల్ప, సౌమ్య, సరిత,సంగీత, శిరీష, నిరోషా,నిత్య, రమాదేవి, శ్రీవాణి,వాసవి, శ్రీలత, అన్విత, ఉమ,శ్రీనివాస్,రాజేష్,రజీ,ప్రమోద్,తిరుపతి, సాధిక్,అఖిల్,నిఖిల్ మరియు టీఎన్జీఓ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## శారీరక దృఢత్వానికి కరాటే ఎంతో దోహదం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**శారీరక దృఢత్వానికి కరాటే ఎంతో దోహదపడుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇల్లందు ప్రభాకర్, కస్తూర్బా గాంధీ స్కూల్ ప్రత్యేక అధికారిణి రజిత అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ రాణి లక్ష్మీ బాయి ప్రసిక్షణ్ పేరుతో కరాటే కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యార్థినీలకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారిణి గురువారం ప్రారంభించగా కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ ఆయా పాఠశాలల విద్యార్థినిలకు కరాటే శిక్షణను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల్లో శారీరక ధృడత్వంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించడం కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమాన్ని విద్యార్థినీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ స్వర్ణలత, కస్తూర్బా గాంధీ పీటీ సరిత ఆయా పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆధార్ సేవా కేంద్రం – సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్ జిల్లా మంథని మండల కేంద్రంలోని రాఘవుల నగర్ (బస్టాండ్ ఎదురుగా ఉన్న లైన్) లో గతంలో నిలిచిపోయిన ఆధార్ సేవా కేంద్రం తిరిగి ప్రారంభమైంది.తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (సూరయ్య పల్లి శాఖ) ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాన్ని,నూతన ఆధార్ కిట్‌తో పునరుద్ధరించినట్లు ఆపరేటర్ సొక్కుల శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది సెప్టెంబర్ నుండి నిలిచిపోయిన సేవలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం 10 ఏళ్లు దాటిన ఆధార్ కార్డులను తప్పనిసరిగా అప్‌డేట్ (డాక్యుమెంట్ అప్‌డేట్) చేసుకోవాలని, అలాగే చిరునామా, ఫోన్ నంబర్ మార్పులు,బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవల కోసం మంథని తో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఈ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం భర్తీపూర్ గ్రామంలో గురువారం మెట్పల్లి సంఘం హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెట్పల్లి సంఘం హాస్పిటల్ యజమాని ప్రముఖ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ రామచంద్ర రెడ్డి 150 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ సంగం అమృత ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీంకర్ అఖిలేష్,మాజీ సర్పంచ్ సంగం సాగర్ వార్డు సభ్యులు వంశీ,రాకేష్, పంచాయితీ కార్యదర్శి దివాకర్, ఆర్ఎంపి నవీన్,కిషన్, గ్రామ ప్రజలు,యువకులు హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రహరీ గోడ పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి ముత్తారం మండలం పారుపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణం చుట్టూ నూతనంగా నిర్మించనున్న ప్రహరి గోడ నిర్మాణ పనులను సర్పంచ్ చొప్పరి సంపత్, ఉప సర్పంచ్ బోడ శ్యామల బాపు గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్ తో పాటు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో శంకుస్థాపనచేసి ప్రహరీ గోడ పనులు జెసిబితో ప్రారంభించారు.అనంతరం సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాలకవర్గంతో పాటు గ్రామస్తులందరూ తమకు సహకరించాలన్నారు.స ర్పంచ్ చొప్పరి సంపత్, ఉప సర్పంచ్ బోడ శ్యామల బాపు గౌడ్,గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్,వార్డు సభ్యులు బోడ లక్ష్మి రాజయ్య,కావేటి నాగ భూషణం,బోడ కృష్ణాకర్, నీలం రాజేందర్ రమ, దాసరి సతీష్, బత్తుల రాజమ్మ గట్టయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ వివో మీన,సి ఏ పద్మ,ఏ ఎన్ ఎం రమాదేవి,ఆశ వర్కర్ విజయ,గ్రామ పంచాయతీ సిబ్బంది సుక్కమ్మ, కుమార స్వామి,రామకృష్ణ తోపాటు విద్యార్థులు తల్లి దండ్రులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే 'ప్రజా బాట'




**ప్రజాపక్షం/ముత్తారం :**గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే ప్రజా బాట కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ బియ్యని శివకుమార్ అన్నారు.గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో విద్యుత్ శాఖ ఏఈ రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్తు సమస్యలు పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఇది ఒక మంచి కార్యక్రమం అన్నారు. అనంతరం విద్యుత్ అధికారులు వెంట గ్రామంలోని పలు విధులను క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ..విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయిలో ఉన్న విద్యుత్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ రాజేందర్,ఎస్.ఈ సంతోష్ రెడ్డి,ఉప సర్పంచ్ పిట్టల రామస్వామి, విద్యుత్ శాఖ సిబ్బంది తోపాటు తదితరులు ఉన్నారు.

## జ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని ఆకసాయిపల్లె గిరిజన గ్రామానికి చెందిన బద్ది దేవన్న, హన్మక్క దంపతులకు కూతురు జ్యోతి (19) ఒక కుమారుడున్నాడు.జ్యోతి డిగ్రీ చదువుతుంది. గత పది రోజుల క్రితం తీవ్ర జ్వరంతో పాటు చాతిలో నొప్పంటు శ్వాస కష్టంగా ఉండటంతో జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ 4 రోజుల పాటు చికిత్స పొందించారు. నయం కాకపోవడంతో వైద్యులు అక్కడి నుండి కరీంనగర కు తీసుకెళ్లాలని సూచించారు. తండ్రి దేవన్న జీవనోపాధికోసం ముంబాయి వెళ్లాడు. కూతురు అనారోగ్య విషయం తెలిసిన వెంటనే ముంబాయి నుండి తిరిగి వచ్చాడు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని పేర్కొనగా వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడి ఆస్పత్రిలో 4 రోజల నుండి చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గురువారం మృతిచెందింది.

# గీత కార్మికులకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** కులవృత్తినే నమ్ముకుని జీవించే గౌడ కులస్తులకు నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సుమారుగా 200 ఈత, తాటి చెట్లను కోల్పోతే తమ గౌడ కులస్తులందరూ రోడ్డున పడాల్సి వస్తుందని చెట్లను కోల్పోతున్న గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కలుగీత కార్మిక సంఘం గ్రామ అధ్యక్షులు తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్ కోరారు. గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామ శివారులోని రోడ్డుపనుల్లో భాగంగా జెసిబి తో సుమారుగా 200 తాటి, ఈత చెట్లను నెలమట్టం చేస్తుండగా గౌడ కులస్తులందరూ కలిసి పనులను అడ్డుకున్నారు.తాటి చెట్లను, ఈత చెట్లను రోడ్డు పనుల్లో తొలగించడంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోవడం జరుగుతుందని దీని ద్వారా 40 మంది గీత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం,అధికారులు స్పందించి గీత కార్మికులకు న్యాయం చేయాలని తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్ కోరుతున్నారు.

# రామలింగేశ్వర అభివృద్ధికి సహకరించండి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** 2027 జరిగే పుష్కరాలకు వాల్గోండా, వాల్గోండా తండా గ్రామల పవిత్ర నది గోదావరి తీరాన ఉన్న శ్రీ రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ కోరుట్ల శాసన సభ్యుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ లను గ్రామానికి చెందిన సర్పంచులు పలువు గ్రామస్తులు గురువారం కలిశారు. ఈ మేరకు మర్యాద పూర్వకంగా కలిసి నిధులను సమకూర్చి అన్ని విధాలుగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అదనపు కలెక్టర్ రాజా గౌడ్, మెట్పల్లి శ్రీనివాస్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ లను కలిసి వినతిపత్రాన్ని అందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సర్పంచులు తోపారపు వసంత , ధరం సోత్ సురేందర్, తండా ఉప సర్పంచ్ శ్రీనివాస్ ,నాయకులు క్యాతం వెంకటరెడ్డి, కిరణ్, నరేష్ రెడ్డి, ప్రభాకర్ బాలరాజు, ఉన్నారు.

# విద్యుత్‌శాఖ అధికారులు ప్రజాబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/మల్యాల:** గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగిత్యాల విద్యుత్ శాఖ డి ఈ గంగారాం అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ వడ్డెర కాలనీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో విద్యుత్ వోల్టేజి సమస్యలు రాకుండా అవసరమైన మేర ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని వేలాడుతున్న వైర్లను సవరించాలని అన్నారు. సరిచేసేందుకు విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ మరమ్మతుల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రామన్నపేట ఏఈ ఆకునూరి శ్రీనివాస్,విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ పదవికి రాజీనామా

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మండలంలోని నడికుడ గ్రామ ఉప సర్పంచ్ ముద్దం శేఖర్ రెడ్డి తన వ్యక్తిగత కారణాలవల్ల ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అలువాల శ్రీకాంత్ కు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. కాగా గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న నిబంధనలు ఉల్లంఘించడంతో ఏర్పడిన వివాదమే ఉప సర్పంచ్ రాజీనామాకు దారి తీసినట్లు సమాచారం.

# కండ్లపల్లి చెరువు మత్తడి ధ్వంసం చేసింది అధికారులా ? గుర్తు తెలియని వ్యక్తులా...?



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి గ్రామ చెరువు మత్తడి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని నీరు వృథాగా పోతుందని కండ్లపల్లి గ్రామ రైతులందరం నష్టపోతున్నాం అని గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిర భవన్ లో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కలిసి వారి సమస్యను తెలుపగా సానుకూలంగా స్పందించిన జీవన్ రెడ్డి సంబంధింత అధికారులతో ఫోన్ చేసి కండ్లపల్లి గ్రామ చెరువు క్రింద వందల ఎకరాల భూమిలో రైతులు పంట నారు వేసుకున్నారు అని గుర్తు తెలియని వ్యక్తులు కండ్లపల్లి గ్రామ చెరువు మత్తడిని ధ్వంసం చేశారని వారి పైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచించారు. కండ్లపల్లి గ్రామ చెరువు మత్తడిని ఒక వేళ ఇరిగేషన్ సిబ్బంది మరమ్మతుల కోసం చేసిన కండ్లపల్లి గ్రామ రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వనిది క్రాప్ హాలిడే ప్రకటించనిది ఎలా చేస్తారు అని అధికారులను ప్రశ్నించారు. కండ్లపల్లి గ్రామ రైతులు నారు పోసుకున్నారు కాబట్టి వారు పంట నష్టపోకుండా వెంటనే మత్తడి పున నిర్మాణం చేయించాలి అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మత్తడి మరమ్మతులు ప్రధానమే కానీ రైతులకు ముందస్తు సమాచారం తెలప కుండా చేయవద్దు అని జీవన్ రెడ్డి అన్నారు.మార్చి నెలలో పొలాల కోతలు అయిపోయిన తర్వాత చేయాలని క్రాప్ హాలిడే ప్రకటించనిది మరమ్మతులు చేస్తే రైతులు నష్టపోతారు అని వెంటనే మత్తడి పూడ్చాలని అధికారులకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కండ్లపల్లి గ్రామరైతులు,ప్రజలు,నాయకులు పాల్గొన్నా రు.

# రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా పిఎసిఎస్‌ల అభివృద్ధి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి మరింత సులభతరం అవుతుందని జగిత్యాల జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం నాడు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ఎఫ్పీఓ (రైతు ఉత్పత్తి సంస్థ)లుగా ఎంపికైన జగిత్యాల జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సామర్థ్య పెంపుదల( కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) ను జగిత్యాల జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్ ప్రారంభించారు. రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా పిఎసిఎస్ ల అభివృద్ధి మరింత సులభతరం జిల్లా సహకార అధికారి : వ్యవసాయ రంగం ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న జగిత్యాల జిల్లాలో ఎఫ్పీఓల ద్వారా సహకార సంఘాలు రైతులకు చేరువ కావాలని జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్ సూచించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి మార్పులకు శ్రీకారం చుట్టాలని ఎఫ్పీఓలను ఆయన కోరారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో నూతన విధానాలను అనుసరించాలని ఆయన సూచించారు. జగిత్యాల జిల్లాలోని అన్ని వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు కావలిసిన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా సహకార అధికారి చెప్పారు. అదేవిధంగా రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఎఫ్పీఓ సభ్యత్వ నమోదులో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన రాయికల్ సొసైటీ పర్సన్ ఇన్ ఛార్జ్ సాయి కుమార్ గౌడ్, కార్యదర్శి రవిని ఆయన అభినందించారు. వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...ఎఫ్పీఓల ద్వారా జిల్లాలో రైతులకు జాతీయ స్థాయిలో మార్కెట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎఫ్పీఓ ల ఏర్పాటులో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుసరి శ్రీనివాస్, బీర్పూర్, రాయికల్ పాక్స్ మాజీ అధ్యక్షులు రాంచందర్ రావు, మల్లా రెడ్డి, ఇతర సంఘ సభ్యులు, సహకార శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు గోలమాల్ పై సివిల్ సప్లయ్ కమిషనర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని జైన పీఏసీఎస్ పరిధిలో వరిధాన్యం కొనుగోలులో చోటుచేసుకున్న అవినీతిలో భాద్యులైన సొసైటీ చైర్మన్, సిబ్బంది, రైస్ మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి యువనేత నల్లవెల్లి సుజన్ రెడ్డి గురువారం హైదరాబాద్ లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను కలిసి ఫిర్యాదు చేశారు. జైనా పీఏసీఎస్ పరిధిలోని ధమ్మన్నపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సొసైటీ చైర్మన్, సిబ్బంది రైతులకు మాయమాటలు చెప్పి వారి నుండి సన్నరకం ధాన్యాన్ని సేకరించి 25 శాతం అదనంగా కొనుగోలు చేసినట్లు దొంగ రికార్డులు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని పక్కదోవ పట్టించడానికి ట్రక్ షీట్ లో దొడ్డురకం ధాన్యం ఏ గ్రేడ్ గా పేర్కొంటూ మిల్లుకు పంపినారని తెలిపారు.100 క్వింటాళ్ల ధాన్యం అందించిన రైతు ట్రక్ షీట్ లో 125 క్వింటాలు గా ఎంట్రీ చేసారని తెలిపారు.ఈ అవకతవకలపై ఫిర్యాదు రాగా జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత మోకాపై విచారణ జరిపి ట్రక్ షీట్ బుక్కును సీజ్ చేసి సెంటర్ సిబ్బందిని సస్పెండ్ చేయాల్సిందిగా జిల్లా సహకార అధికారికి అదేశాలివ్వగా నామమాత్రపు నోటీసు ఇచ్చి చేతులుదులుపుకున్నారని ఫిర్యాదు లో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం ప్రజలకు చేరకుండా నాసిరకం బియ్యం రేషన్ షాపుల్లోకి రావడం తోపాటు కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం పక్కదోవ పడుతున్నదని వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి సొసైటీ చైర్మన్, సిబ్బంది,మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నల్లవెల్లి సుజన్ రెడ్డి ఫిర్యాదు లో పేర్కొన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమ్మరి తిరుపతి, పిల్లి శ్రీనివాస్, బెజ్జారపు లవన్ తదితరులు ఉన్నారు.

# పట్టుదలతో చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాఘవపేటలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ ను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం తక్కువ ఉండడం తనను ఎంతో ఆందోళన కలిగిందని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. ఈయన వెంట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్, బిఆర్ఎస్ సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్, కుస్తాపూర్ సర్పంచ్ జెల్లా రాజు, సీనియర్ నాయకుడు డీలర్ మల్లయ్య,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, వార్డు సభ్యులు కొంపల్లి రాకేష్, ముష్కరి రమేష్, కళాశాల అధ్యాపక బృందం ,విద్యార్థులు,వివిధ గ్రామాల నాయకులు తదితరులున్నారు.

# నూతన సర్పంచ్‌లను సన్మానించిన యూత్ కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం /కోనరావుపేట:** గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు గొప్ప అవకాశం లభించిందని, ప్రభుత్వం అందించే సహకారంతో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దాలని వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ అన్నారు. కోనరావుపేట మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచులను ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గంలోని పల్లెలన్నీ అభివృద్ధిలో పోటీ పడాలని, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మౌళిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్,దినేష్ గౌడ్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ నవీన్, వినయ్, పెంట శ్రీకాంత్, సందెల శశి, వెంకటేష్, బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదనపు ట్రిప్ నడపాలని డిపో మేనేజర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామానికి అదనపు ట్రిప్పు బస్సును నడపాలని గ్రామ సర్పంచ్ పుప్పాల లక్ష్మి మహేష్ గురువారం మెట్పల్లి బస్ డిపో మేనేజర్ సరస్వతిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మహేష్ మాట్లాడుతూ గ్రామానికి మెట్పల్లి నుండి అమ్మక్కపేట మీదుగా ఉదయం, సాయంత్రం బస్సు నడుస్తుందని దీంతో మధ్యాహ్నం పూట వివిధ పనుల నిమిత్తము మండల కేంద్రానికి, మెట్పల్లి కి గాని వెళ్లడానికి మహిళలు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్నం పూట అదనపు ట్రిప్ బస్సును నడపాలని బస్ డిపో మేనేజర్ కలిసి కోరినట్లు మహేష్ తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ జెడ్పిటిసి కంతం భారతి రమేష్, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య,తదితరులున్నారు.

# పొలాస సహస్ర వేయి లింగాల ఆలయంలో నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి ఆశీర్వచనం



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాలలో నూతనంగా ఎన్నికైన టియూడబ్ల్యూజె (ఐజెయూ) అనుబంధ జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను గురువారం సహస్ర వేయి లింగాల ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా ఆలయానికి ఆహ్వానించినారు.ఈ నేపథ్యంలో ఆలయంలో వేద బ్రాహ్మణుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యవర్గ సభ్యులందరికి సహస్ర వేయి లింగాల ఆలయ కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి, వేద బ్రాహ్మనులచే ఆశీర్వచనాలు, స్వామి వారి ప్రసాదాలు అందించిన అనంతరం ఆలయ ట్రస్టు చైర్మన్ నలమాసు గంగాధర్, మేనేజింగ్ డైరెక్టర్ కొయ్యడ రమేష్, ట్రెజరర్ కొయ్యడ శేఖర్, కార్యవర్గ సభ్యులు తిరుపతి గౌడ్, చంద్ర శేఖర్ లు కండువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్, ఉపాధ్యక్షులు శనిగరపు శ్రీనివాస్, కోశాధికారి బోయినిపల్లి శ్రీధర్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కడార్ల రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గాజుల మహేష్, కార్యవర్గ సభ్యులు నీరటి గంగాధర్, ఎల్ల క్రాంతి కుమార్, సామ మహేష్ ,కట్కూరి సంతోష్, ఎండి సాబేర్ అలీలు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ఆశా వర్కర్లను నియమించాలి

ప్రజాపక్షం/నస్పూర్ : మంచిర్యాల మున్సిపాలిటీలో వెంటనే ఆశా వర్కర్లను నియమించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నయీం పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్యశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో ఆశా వర్కర్లు పనిచేస్తున్నప్పటికీమంచిర్యాల మున్సిపాలిటీలో లేకపోవడం సరికాదన్నా రు. దీని వల్ల గర్భిణీలు, బాలింతలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం స్పందించి నియామకాలు చేపట్టాలని కోరారు.

# ఘనంగా భీమదేవర జెండా పండుగ

ప్రజాపక్షం/పెంచికలపేట్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం లోని చేడువాయి గ్రామంలో భీమదేవర జెండా పండుగను గురువారం ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులతో కలిసి కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమ్ స్ఫూర్తితో ఈ జెండా పండుగను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. కొమురం భీం ఆదివాసులకు ఆరాధ్య దైవమని, జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన మహాయోధుడని కొనియాడారు. ఆదివాసులు ఐక్యతతో కలిసి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నానాజీ, మాజీ సర్పంచ్ పోషన్న, ఎంపిటిసి సత్తయ్య, నాయకులు బందన్న, శ్రీనివాస్, బందు, శశి కుమార్, బాబు, సోమన్న, మల్లేష్, గంగారాం, ఉత్తమ్, ఆదివాసులు తిరుపతి, రవి, రాజు, శ్రీనివాస్, సుమన్, మహిళలు తారా, శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకు పోలీసులు ప్రాధాన్యం

## కేరమేరి ఎస్ఐ మధుకర్

ప్రజాపక్షం/కేరమేరి : శాంతి భద్రతలతో పాటు సామాజిక సేవకు పోలీసులు ప్రాధాన్యం ఇస్తున్నారని కేరమేరి ఎస్ఐ మధుకర్ తెలిపారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం చిన్నగూడా గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు 20 దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విద్య కీలకమని సూచించారు. నిషేధిత పంటలు సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల జీవనాభివృద్ధే లక్ష్యం

## ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పేర్కొన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టులో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై అందజేసిన చేపపిల్లలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రాజెక్టులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు మత్స్యకారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మత్స్యకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి నియంత్రిత వాతావరణంలో చేపలను పెంచి వాణిజ్య అవసరాల కొరకు ఉత్పత్తి చేసే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిజాంసాగర్ రిజర్వాయర్‌లో మొత్తం 48.18 లక్షల చేపపిల్లలను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, స్థానిక మండల నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

## మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్



ప్రజాపక్షం/జన్నారం : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభం కలుగుతుందని, ప్రతి రైతు దీనిపై దృష్టి సారించాలని జన్నారం మండల ఇంచార్జ్ వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్ సూచించారు. గురువారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాచురల్ మిషన్, న్యాచురల్ ఫామింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుందని, భూమి సారం పెరుగుతుందని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చని, పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ పథకంలో భాగస్వామ్యమైన రైతులకు 2 సంవత్సరాల పాటు ప్రోత్సాహకాలు, ప్రకృతి సాగులో పాటించాల్సిన మెలకువలు, పద్ధతుల గురించి వివరిస్తామని చెప్పారు.ఎఎంసి చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, ఇంచార్జ్ ఎంపిఒ జలంధర్, సర్పంచ్ గోదావరి మారుతి, ఉపసర్పంచ్ మహేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు మల్యాల త్రిసంధ్య, లవన్, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాపక్షం/ రెబ్బెన : రెబ్బెనలోని సాయి విద్యాలయం ఎస్ వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో గురువారం సంక్రాంతి పండుగ సంబరాలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయగా, సంక్రాంతి పండుగ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా భోగి మంటలను వేశారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా రెబ్బెన ఉపసర్పంచ్ వరలక్ష్మి, బిఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొందరపు శంకరమ్మ, బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పద్మ, బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణ కుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేసరి కిషన్ గౌడ్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అవిశాసురేష్, సాగరిక, గాయత్రి మేహితలకు బహుమతులను అందజేశారు. అనంతరం రెబ్బెన ఉప సర్పంచ్ వరలక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసరి కిషన్ గౌడ్ మాట్లాడుతూ సాయి విద్యాలయం పాఠశాల 29 సంవత్సరాల నుండి అత్యుత్తమైన విద్యను అందిస్తూ సమాజానికి, దేశానికి ఎంతోమంది మేధావులను అందించిందని కొనియాడారు. పోలీసు డిపార్ట్మెంట్లో ఎంతోమంది సేవ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న జనరేషన్ కు అనుకూలంగా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యను అందించడానికి కేరళ టీచర్లతో ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుప్పా నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ సంజీవ్ కుమార్, మాజీ ఎంపిటిసి సురేందర్ రాజ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్రం తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకులు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# చలో ఇందిరాపార్క్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న నిర్వహించనున్న 'చలో ఇందిరాపార్క్' పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద కొమురం భీం జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర అనిర్వచనీయమని, రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ జీవితాల్లో వెలుగు నిండుతుందని ఆశించామని, కానీ నేటికీ నిరుద్యోగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో అర్హులైన కళాకారులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే తెలంగాణ ఉద్యమ కళాకారుల పోరు దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎంసిసి కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలి



ప్రజాపక్షం/ మంచిర్యాల : ఎంసిసి సిమెంట్ కంపెనీ మూతపడటంతో కంపెనీలో పని చేస్తున్న 53 మంది కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట కార్మికులు చేస్తున్న దీక్షకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి గురువారం మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి ప్రతి కార్మికునికి రూ. 50 లక్షల నష్ట పరిహారం, రెండు గుంటల భూమి అందించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా కార్మికులు ఈ కంపెనీపై ఆధారపడి ఉన్నారని, కంపెనీ మూతపడటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ఆదుకోవాలని కోరారు. రవీందర్ రావు, సతీష్ రావు, అరేందుల శ్రీనివాస్, శివ కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలకేంద్రంలోని రిచ్‌మైండ్స్ హైస్కూల్, పిట్లం కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026పై గురువారం అవగాహన సదస్సును జిల్లా రవాణా అధికారి జె.శ్రీనివాస్ ఆదేశానుసారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బంచానిధి ఘంటా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు సహాయక మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లు కె.మధుకర్, ఉదయ్ కుమార్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రాముఖ్యత, ప్రతీ విద్యార్థి ప్రథమ చికిత్స పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులచే రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిట్లంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో సెంటర్ లైటింగ్, విద్యుత్తు స్థంబాలు, తాగునీరు, మురికి కాలువలు తదితర మౌళిక వసతులు కల్పించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కోరారు. దశల వారీగా సమస్యలను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. పిట్లం సర్పంచు కుమ్మరి శేఖర్, ఉపసర్పంచు అవేజ్‌బేగ్, పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ అందరి బాధ్యత

## ఇందనపల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ

ప్రజాపక్షం / జన్నారం : ప్రాణాలకు ముప్పు తెచ్చే చైనా మాంజాను వాడకూడదని, అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఇందనపల్లి రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో గురువారం వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాముఖ్యతపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చైనా మాంజాతో మనుషులకు, పక్షులు, జంతువులకు ప్రాణహాని జరిగే అవకాశం ఉందన్నారు. ఇది పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి రవి, మల్లేష్, పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, బీట్ అధికారులు తన్వీర్ పాషా, రాజేశ్వర్, పాఠశాల ఇంచార్జ్ తిరుపతి, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

## అభినందించిన సిఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్

ప్రజాపక్షం / మందమర్రి : స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు మందమర్రి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాల విద్యార్థులు రాంటెంకి అశ్వద్, బెల్లం మనస్వి ఎంపికయ్యారు. కొమురం భీమ్ జిల్లాలో జనవరి 6న జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోటీల్లో వీరు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఖమ్మంలో ఈ నెల 16, 17, 18 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఎంపికైన విద్యార్థులను పట్టణ సిఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ శాలువాతో సత్కరించారు. ప్రతి పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక, శారీరక దృఢత్వంతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి తీర్మానాలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీ గ్రామాల్లో గురువారం సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యుల తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు ఇందులో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, పారిశుధ్యం,పచ్చదనం, పరిశుభ్రత వంటి అంశాలపై తీర్మానాలు చేసి, ప్రభుత్వ నిధులను వినియోగించుకోవడానికి తీర్మానం చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



# సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** దివ్యాంగుల కోసం నిర్వ హిస్తున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం కొనసాగుతున్న దివ్యాంగుల నిర్ధారణ సదరం శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. శిబిరా నికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారు లను ఆదేశించారు. అర్హత కలిగిన వారికి ధ్రువపత్రా లను అందించాలని తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు, సహాయకులకు తాగునీరు, నీడ, కుర్చీలేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిం చాలన్నారు. మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఆలస్యం కాకుండా నిర్ణీత సమయంలోనే పరీ క్షలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్యు లకు పలు సూచనలు చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల



పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, ఆసుపత్రి ఆర్ ఎంఒ, ఎస్ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంసిసి కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/ మంచిర్యాల :** ఎంసిసి సిమెంట్ కంపెనీ మూతపడ టంతో కంపెనీలో పని చేస్తున్న 53 మంది కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట కార్మికులు చేస్తున్న దీక్షకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి గురువారం మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి ప్రతి కార్మికునికి రూ. 50 లక్షల నష్ట పరిహారం, రెండు గుంటల భూమి అందించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డి మాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా కార్మికులు ఈ కంపెనీపై ఆధారపడి ఉన్నారని, కంపెనీ మూతపడటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. రవీందర్ రావు, సతీష్ రావు, అరేందుల శ్రీనివాస్, శివ కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

## 11 నుంచి భీమయ్యక్ సట్టి జాతర

**ప్రజాపక్షం / కెరిమెరి :** ఆదివాసీ సం స్కృతి, సంప్రదాయాల బద్ధంగా ఓంరాజ్ వంగేపూరి భీమయ్యక్ సట్టి జాతర నిర్వహి స్తున్నట్లు తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ తెలిపారు. జోడేఘాట్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న పట్నా పూర్‌లో ఈ నెల 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవా లకు భక్తులు అధిక సం ఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకోవాలని పిలుపుని చ్చారు.ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు డాక్టర్ కనక ప్రభాకర్, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం రాజు, విద్యార్థి సం ఘం మండల అధ్యక్షులు సెడ్మాకి తుకారాం, వాంకిడి మం డల తుడుం దెబ్బ అధ్యక్షు లు మడవి భీం రావ్, నిషని సర్పంచ్ కుంరం అంబారావు, బీసీ సంఘం సీనియర్ నాయకులు కో ట్రేం గే నాగుపటేల్, సెండే నారాయణ, పెం దో ర్ శ్రీనివాస్, తలండి జంగు, కుంరం తిరుప తి, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆత్మబంధువులు హైమన్ డార్ఫ్ దంపతులు

ఎస్పి నితికా పంత్

**ప్రజాపక్షం / జైనూర్/ కెరిమెరి/ ఆసిఫాబాద్ :** ఆదివా సీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ దంపతులు అని కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నికిత పంత్ అన్నారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శిం చిన ఆమె హైమన్ డార్ఫ్ దంపతులకు ఘనంగా నివాళుల ర్పించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎస్పికి గ్రామస్తులు ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి ప్రకారం ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ కనక ప్రతిభ పుష్ప గుచ్ఛం అందజేసి నుదిటిన తిలకం దిద్దారు. అనంతరం డార్ఫ్ రీడింగ్ రూమ్, హైమన్ డార్ఫ్ మ్యూజియం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠ శాల, రాయి సెంటర్ మర్రి చెట్టు స్థలంలను ఎస్పి సంద ర్శించి అక్కడి పరిస్థితులు, అవసరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాల



యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో విద్య, వ్యవసాయం, వైద్యం, మౌలిక సదుపాయాలు, అభి వృద్ధి అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం గ్రామంలోని మహిళలకు ఎస్పి నికిత పంత్ బ్లాంకెట్లను పంపిణీ చేశారు. మార్లవాయి గ్రామ మహిళలు ఎస్పికి ఆత్మీయ సన్మానం నిర్వహించి ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ రచించిన నివేదిక పుస్తకాన్ని బహూకరించారు. జనవరి 11న జరగనున్న సభ ఏర్పాట్లకు సంబంధించిన విషయా లను అధికారులతో అడిగి తెలుసుకున్నారు.

## తలాండి పంచాయతీ నూతన భవన పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ తిర్యాణి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యామణి మండలంల తలాండి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పను లకు గురువారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ నైతం మంగు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులకు మెరుగైన సేవలందించేందుకు, ప్రజా పాలనలో ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ నూతన భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మెండ్రపు కిరణ్, గ్రామ ప్రముఖులు పులి కొమురయ్య, వెంకటేశం, పెట్టం శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

**ప్రజాపక్షం / తిర్యాణి :** అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు శ్రమదా నంతో గుంతలమయమైన రహదారికి గురువారం మరమ్మతులు చేశారు. తిర్యాని మండలంలోని మంగీముల్లలమంద గ్రామ పంచా యతీ పరిధిలో ఉన్న తోయగూడ నుండి భీమ్రాల వరకు వెళ్లే రహదారి గత కొంతకాలంగా పూర్తిగా దెబ్బతింది. ఈ విషయాన్ని గమనించిన యువ సైన్యం సభ్యులు సొంత ఖర్చులతో మొరం పోయించి గుంత లను పూడ్చి వాహనదారుల కష్టాలు తీర్చారు. మరోవైపు మండలం లోని గంభీరావుపేట గ్రామానికి చెందిన సైదం భీమక్క ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి అనిల్ అన్న యువ సైన్యం ఫౌండర్ జువ్వాజీ అనిల్ గౌడ్ రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబాన్ని ఆదుకున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుడిమేత హనుమంత్ రావు, జుమ్మిడి కిష్టయ్య, ఉప సర్పంచ్ అర్క మల్లేష్, కుడుమేత రమేష్, ఉయిక గోవింద్, యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** విద్యార్థు లకు గుణాత్మకమైన విద్యను ఉపాధ్యా యులు అందించాలని సామాజిక కార్యకర్త చెపిడే ప్రకాష్ పేర్కొన్నారు. మండలం లోని మొట్లగూడ గ్రామ మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహా రాన్ని అందించాలని, ఉపాధ్యాయులు వి ద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చే స్తూ తరగతిలో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

## బౌద్ధుల ప్రతీక పంచశీల జెండాః అశోక్ మహుల్కర్

**ప్రజాపక్షం / వాంకిడి :** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధు లకు పంచశీల జెండా ప్రతీక అని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, గౌరవ అధ్య క్షులు జయరాం ఉప్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రం లోని జేత్వాన్ బౌద్ధ విహార్‌లో గురువారం జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 1885లో కొలంబో వేదికగా ప్రపంచ బౌద్ధుల కమిటీ ఈ జెండా రూపొందించిందని, 1952లో వర్ల్డ్ ఫెలోషిప్ ఆఫ్ బుద్ధిస్ట్ అంతర్జాతీయ బౌద్ధ జెండాగా ఆమోదించిందని తెలిపారు. సారనాథ్ స్థూపం నుంచి ప్రేరణ పొందిన ఈ జెండాలోని ఆరు రంగులు బుద్ధుని బోధనలను సూచిస్తాయని పేర్కొన్నారు. నీలం రంగు శాంతి, సహనం, పసుపు జ్ఞానం, వివేకం, ఎరుపు శక్తి, ధైర్యం, తెలుపు పవిత్రత, సత్యం, ఆరెంజ్ భక్తి, విశ్వాసం, అన్ని రంగుల కలయిక బౌద్ధుల ఏకత్వం, సమానత్వానికి నిదర్శనమని వివరించారు. పంచశీల జెండా బౌద్ధుల ఏక



త్వాన్ని సూచిస్తుందని సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు దుర్గం సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షులు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, కార్యదర్శి రోషన్ ఉప్రే, సమాజ్ అధ్యక్షులు శ్యామ్ రావు, లహూజీ దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, నాయకులు దుర్గం ప్రశాంత్ విఠల్, సురేష్, పోచాలు, వివేక్ నారాయణన్, భీమ్ రావు పాల్గొన్నారు.

## సర్పంచ్ చొరవ.. తీరిన తాగునీటి కష్టాలు

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు ప్రత్యేక చొరవతో చేతి పంపుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. మండలంలోని సాకడ కుమురం భీం చౌర స్తా వద్ద గత రెండేళ్లగా మూలనపడిన చేతిపంపునకు గురువారం మరమ్మతులు చేయించారు. పని చేయకపోవడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు, కూలీలు, బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ వెంటనే స్పందించి మరమ్మతులు చేయించడంతో సమస్య పరిష్కారమైంది. తాగునీటి కష్టాలు తీర్చిన సర్పంచ్ ఆనందరావుకు రైతులు, కూలీలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్త నాల దుకాణాల్లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎఒ అంజిత్ రావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీ లలో భాగంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి యూరియా నిల్వలను అడిగి తెలుసుకు న్నారు. ఎవరైనా యూరియా అక్రమాలకు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా శాఖాపరమైన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. పత్తి రైతుల వివరాలు సేకరించి రికార్డులు సరిగా నిర్వహించాలని దుకాణ యాజమాన్యాలకు సూచించారు.

# కాసిపేటలో ఓపెన్ జిమ్ ఏర్పాటు

**ప్రజాపక్షం / కాసిపేట :** కాసి పేట గ్రామానికి మంజూరైన ఓపెన్ జిమ్ ప నులను వేగంగా పూ ర్తి చేయించినందుకు మంద మర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు సర్పంచ్ బాదావత్ నీల రాంచందర్ కృతజ్ఞతలు తెలి పారు. గత వారం జిఎంను కలిసి ఓపెన్ జిమ్, గ్రామ సమ స్యలను వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. గురువారం జిమ్ పరికరాలను తెప్పించి వెంటనే పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సద్వినియోగం చేసు కోవాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామంలో సోలార్ లైట్లు, మురికి కాలువలు,



శుద్ధి నీటి యంత్రాలు, కల్వర్టులు, అభివృద్ధి పనులకు సహకరించిన ఏజెంట్ రాంబాబు, మేనేజర్ సతీష్, సివిల్ అధికారులు రాము, శ్రీధర్, దాగం మల్లేష్, బన్న లక్ష్మన్ దాస్, కార్మిక సంఘాల నాయకులకు గ్రామస్తులు ధన్యవా దాలు తెలిపారు.

## ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

**ప్రజాపక్షం / దండేపల్లి :** ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించే దుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రతినెలా సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు దమ్మా నారాయణ కోరారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మోదెల గ్రామానికి చెందిన ఆయన కమిటీ సభ్యుడిగా ఎంపికైన సందర్భంగా గురువారం దండేపల్లి మండల తహసీల్దార్, ఎస్ఐ, ఎంపిడిఓలను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు రావాల్సిన నిధులు, అట్రాసిటీ కేసుల ఫిర్యాదులు, భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు విజిలెన్స్ కమిటీతో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో చట్టా లపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లూరి రవికుమార్, సంఘ మార్గనిర్దేశ కులు అక్కల సురేష్, కిషన్ గౌడ్, మునిమడుగు గంగన్న, దుర్గం రాము పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/నర్సాపూర్ (జి) :** మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన రైతు నీరటి గంగాధర్ ఏడాది క్రితం పంట నష్టంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకోగా,ఆ బాధిత కుటుంబాన్ని రైతు స్వరాజ్య వేదిక ఆదుకుంది.రూరల్ డెవలప్ మెంట్ సర్వీస్ సొసైటీ (డిఆర్ఎస్ఎస్) ఆర్థిక సహకారంతో,రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి రూ.50 వేల విలువైనగేదెను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడుతూ,రైతు భార్య సవితకు జీవనోపాధి కల్పించి,ఆ కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు, పిల్లల చదువులకు ఆసరాగా నిలిచేందుకు ఈ సాయం చేసినట్లు తెలిపారు.గతంలో నూ అనేక బాధిత కుటుంబాలకు కుట్టు మిషన్లు, కిరాణా షాపులు,పశువుల పంపిణీ ద్వారా చేయూతనిచ్చామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ స్వదేశ్,సామాజిక కార్యకర్త శంకర్,రమణ పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన నియోజకవర్గ పరిధిలోని పలువురు బాధితులను బీజేఎల్పీ నేత,నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు.గురువారం ఆసుపత్రికి వెళ్లిన ఆయన,సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన మలుకుల భోజన్నతో పాటు కౌట్ల(బి) గ్రామ మాజీ సర్పంచ్ మోహన్‌లను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం వారు పొందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే,వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాధితులకు అండగా ఉంటామని,త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు గ్రామ సర్పంచ్ విలాస్, మండల నాయకులు,పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్ లో సిఎం కప్‌ర్యాలీ

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడల పట్ల గొప్ప ధార్మనికత కలిగి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని దిలావార్‌పూర్ సర్పంచ్ పాల్దే అక్షర అనిల్ అన్నారు.మండల అభివృద్ధి అధికారి అరుణ రాణి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సి.ఎం కప్ ర్యాలీని క్రీడజ్యోతి వెలిగించి,జెండా ఊపి ప్రారంభించిన అనంతరం సర్పంచ్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.ల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. మండల విద్యాధికారి సదానందం, వ్యాయమ ఉపాధ్యాయులు ంబాజి,జయ,వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన నూతన సర్వేయర్లు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో గురువారం నూతన సర్వేర్లుగా తీగల సందీప్, సైకం రోష్మి, నూకల రాజశేఖర్ తాసిల్దార్ మధుసూదన్ రెడ్డిని కలిసి తమ జైనింగ్ లెటర్ తాసిల్దార్ కి అందజేసి వీధుల్లో చేరారు.ఈ సందర్భంగా వారికి తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి సర్వేర్లకు బాధ్యతలు అప్పజెప్పితూ స్వాగతించారు.

## సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్..




**ప్రజాపక్షం/భైంసా :** భైంసాలోని ఎస్.ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో చేపట్టే సర్పంచుల సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్,బిజెపి జిల్లా అధ్యక్షులు రితిష్ రాథోడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రావాల్సి ఉండగా ఢిల్లీ లో ఐర్లాండ్ ప్రతినిధి బృందం చే అత్యవసర భేటీ ఉండడంతో ఆయన కార్యక్రమం రద్దయిందని తెలిపారు.సన్మాన కార్యక్రమం యధావిధిగానే కొనసాగుతుందని బిజెపి నాయకులు కార్యకర్తలు,సర్పంచ్‌లు ఉప సర్పంచ్‌లు వార్డ్ మెంబర్లు పెద్ద మొత్తంలో తరలి రావాలన్నారు.ఈ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఎంపి నగేష్ హాజరవుతారని తెలిపారు.

## ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి



**ప్రజాపక్షం/భైంసా :** భైంసా ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వం అత్యధిక పరికరాలు ఇచ్చినప్పటికీ వాటికి ఉపయోగంలోకి తేవడం లేదెందుకనిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఏరియా ఆసుపత్రి వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.గురువారం భైంసా ఏరియా హాస్పిటల్‌లో ఆరు లీక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్ ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ అధికారులు వాటిని ఉపయోగించడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు.ప్రారంభోత్సవం అనంతరం ఆయన ఆసుపత్రిలో ఎస్.ఎన్.సిప యూ (ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు.అక్కడే ఉన్న జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతూ హైదరాబాదులో నిమ్స్ ఆస్పత్రి ప్రైవేట్ ఆసుపత్రికి బేబీ వార్మర్ మిషన్‌లు,ఐ.సి.యు సెంటర్ ఉపయోగం లోకి తేవాలని సూచించారు.కొందరు డాక్టర్ లు సొంతగా ఏజెంట్లను పెట్టి ఆస్పతి నుండి రోగులను తరలించడం సరికాదన్నారు.ఇకనైనా తీరు మార్చుకొని పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు.సబ్ కలెక్టర్ సాం కేత్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే వైద్యులచే సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆస్పత్రిని బాగుపరుస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట డి.సి.హెచ్.ఎస్ ఏరియాస్పత్రి సూపరిడెంట్ డాక్టర్ కాశీనాథ్,వైద్యులు విజయనంద్,సీనియర్ వైద్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్,భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి,నాయకులు వెంగళరావు ఉన్నారు.

## ఆరాధన ఆయుర్వేద హాస్పిటల్‌కు విజ్ఞాన విహారయాత్ర




**ప్రజాపక్షం/భైంసా :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల,భైంసా ఆధ్వర్యంలో విద్యార్థివిద్యార్థినుల సమగ్ర అవగాహన కోసం ఆరాధన ఆయుర్వేద హాస్పిటల్‌కు విజ్ఞాన విహారయాత్రను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆయుర్వేద వైద్య విధానాలు,పంచకర్మ చికిత్సలు,ఔషధ మొక్కల వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు.ఆరాధన ఆయుర్వేద హాస్పిటల్ డాక్టర్ రాజ రెడ్డి మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ హాస్పిటల్ స్థాపన యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు.పల్లెటూరి ప్రాంతలో స్థాపించబడినప్పటికీ,ఈ హాస్పిటల్ కు ఇతర దేశాల సహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది ఆరోగ్య సమస్యలు గలవారు వచ్చి ఆయుర్వేద చికిత్సలు పొందుతున్నారని వివరించారు.ఔషధ మొక్కల నుంచి రసం తయారీ,ఆయుర్వేద మందుల తయారీలో పాటించే ప్రక్రియలు,వాటి ఆరోగ్య ప్రయోజనాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ విజ్ఞాన విహారయాత్ర విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు,ప్రాచీన భారతీయ వైద్య పద్ధతుల విలువను తెలియజేసింది.ఈ కార్యక్రమం సజావుగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య,తెలిపారు.సురేందర్,జి.కిషన్ రాజయ్య ఇర్ఫాన్,( శావణ్య వహీద్,ఉజుమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## భైంసా ఆల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి విచ్చేశారు.బోగి మంటలు,గంగిరెద్దులు,పంట పొలం, బొమ్మల కొలువు,ముగ్గుల పోటీలు,పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆల్ఫోర్స్ పాఠశాలలో కేవలం విద్యనే కాకుండా మన జాతీయ పండుగలను, మన రాష్ట్ర పండుగలను వాటి గొప్పతన్నాన్ని విశిష్టతను పిల్లలకి తెలియజేస్తూ విద్యతో పాటు అన్ని రంగాల్లో మంచి జ్ఞానాన్ని అందిస్తున్నామని తెలియజేశారుఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ చీరల పంపిణీ

**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రమైన తానూర్ తో పాటు హిప్నెల్లి,బొంద్రట్ గ్రామంలో గురువారం బతుకమ్మ చీరల పంపిణీ ఘనంగా జరిగింది,తానూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ జాదవ్ సుగంధ మాధవరావు పటేల్,మహిళలకు చీరలు అందజేశారు.బొంద్రేట్ గ్రామంలో సర్పంచ్ షీంధే రవీందర్ పటేల్,హిప్నెల్లి గ్రామంలో సర్పంచ్ గంగాసాగర్ శివరాం,పాల్గొని ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు.

## సిఎం కప్ క్రీడల అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/తానూర్ :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు తానూర్ మండల కేంద్రంలో గురువారం సీఎం కప్ క్రీడలపై అవగాహన సదస్సు,భారీ ర్యాలీ నిర్వహించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ నెల 17వ తేదీ నుంచి సీఎం కప్ క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందని,ఆసక్తిగల అభ్యర్థులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శుల వద్ద దరఖాస్తులు చేసుకోవాలన్నారు.తహశీల్దార్ మహిందర్ నాథ్,సర్పంచ్ సుగంధ మాధవరావు పటేల్,ఉప సర్పంచ్ ఫారుక్,పంచాయతీ కార్యదర్శి జాలం సింగ్,వార్డ్ సభ్యులు,ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయిబాబు,ఉపాధ్యాయులు పాల్గొని క్రీడల ప్రాముఖ్యతను వివరించారు.

## కుంటాలలో సిఎం కప్ టార్చ్ ర్యాలీ

**ప్రజాపక్షం/కుంటాల :** గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులు,యువత రాణించాలని ఎంపీడీవో అల్లాడి వనజ అన్నారు.విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కప్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు క్రీడాకారులు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకొని సీఎం కప్ పోటీలలో పాల్గొనాలని కోరారు.

## కిచెన్ షెడ్ నిర్మాణం..

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని సవర్గ్రామ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కిచెన్ షెడ్ నిర్మాణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యా కోసం విద్యార్థుల పౌష్టికాహారానికి సౌకర్యవంతంగా ఉండడానికి ఈ షెడు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్,మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ పరీక్ష కేంద్రాల్లో 6652 మంది ప్రథమ సంవత్సర,6473 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం కలిపి 13125 మంది విద్యార్థులు పరీక్షలు పరీక్షలు రాయబోతున్నట్లు వివరించారు.ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18వ తేది వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.పరీక్ష జరుగుతున్నంతసేపు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా పరీక్షల సమయానికి తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు.పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం అయ్యే అధికారులందరికీ శిక్షణను ఇవ్వాలని తెలిపారు.ఎటువంటి మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం,డిఈఓ భోజన్న,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బిట్ కాయిన్ మోసాలకు పాల్పడిన టీచర్లపై చర్యలు తీసుకోవాలి

### డిఇఒకు మాజీ ఎంపిటిసి సుదీప్ వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో గత కొన్ని నెలల క్రితం చోటు చేసుకున్న బిట్ కాయిన్(క్రిప్టో కరెన్సీ)మోసం కేసులో నిందితులుగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోతుల్ గాం మాజీ ఎంపీటీసీ సుదీప్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న ను కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గతంలో సదరు ఉపాధ్యాయులు బిట్ కాయిన్ పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలకు అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి,వారి నుండి భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు.ఇంతటి అక్రమాలకు పాల్పడి,కేసుల్లో ఉన్నప్పటికీ సదరు ఉపాధ్యాయులు ఇప్పటికీ విధుల్లో కొనసాగడం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం,విద్యాశాఖ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని,బాధ్యులైన టీచర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సుదీప్ ఈ సందర్భంగా కోరారు.

## బీసీ సబ్ ప్లాన్ అమలు కోసం అదనపు కలెక్టర్‌కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరికీ సామాజిక న్యాయం చేకూరాలంటే వెంటనే బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది.గురువారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గైని సాయి మోహన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు..రాష్ట్ర జానాభాలో అత్యధిక శాతం ఉన్నబీసీల సంక్షేమ కోసం బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని,ఆ నిధులు ఇతర రంగాలకు మళ్లించకుండా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెడ్లోడు శంకర్,జిల్లా మహిళా వింగ్ అధ్యక్షురాలు లక్ష్మి,అధికార ప్రతినిధి సుతారి శంకర్,ఉపాధ్యక్షుడు గోదురి రమేష్,మైనారిటీ అధ్యక్షుడు సాబీర్,కోశాధికారి మారుతీ సిందే, యూత్ అధ్యక్షుడు పనుల హరీష్,కుంటాల మండలం యూత్ అధ్యక్షుడు మగ్గిడి రాము జిల్లా కమిటీ సభ్యులు,ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రంగోత్సవ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాపక్షం/మోర్తాడ్‌: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ముంబాయి వారు నిర్వహించిన రంగోత్సావ్ పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ప్రభాకర్ విద్యార్థులను అభినందించారు. కలరింగ్ 11, హ్యాండ్ రైటింగ్ 3, క్యారీ కేచర్ 2, మెడల్స్, ట్రోఫీ రావడం జరిగింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ప్రతిభకు కారకులు ఆర్ట్స్ టీచర్ మోత్కు రాములు ఉపాధ్యాయ బృందం అభినందించారు.ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ఖ్యాతిని నలుమూలాల విస్తరింపజేశారు

ప్రజాపక్షం/నిజామాబాద్ : దేశ ఖ్యాతిని ప్రపంచం నలుమూలాల విస్తరింపజేసిన ఘనత స్వామి వివేకానందకు దక్కుతుందని ఎంఈఓ వెంకటనారాయణ అన్నారు. భాగంగా 10వ తరగతి విద్యార్థులకు ముఖ్యమైన బిట్ బ్యాంకును అందజేశామన్నారు. అదేవిధంగా పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు బహుమానాలను అందించామని, స్వామి వివేకానంద దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలాల విస్తరింపజేశారన్నారు.మన భారతీయ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్, సొసైటీ అధ్యక్షులు శేఖర్, సభ్యులు వంశీ, పాండు, సాయితేజ, విష్ణు, సంజీవ్ పాల్గొన్నారు.

## ఎస్సెస్సార్ డిగ్రీ ఫలితాలను విడుదల చేసిన వీసీ

ప్రజాపక్షం/నిజామాబాద్ : టియు అనుబంధ కళాశాలలైన ఎస్సెస్సార్ కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను టియు వీసీ ఆచార్య యాదగిరిరావు, ఆచార్య ఎం.యాదగిరి చేతుల మీదుగా గురువారం వీసీ ఛాంబర్‌లో విడుదల చేవారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు 40.59 శాతం రాగా అందులో బాలికల శాతం 57.14 శాతం ఉండగా బాలురకు 30.27 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలపై టియు వీసీ మాట్లాడుతూ కళాశాల విద్యపై విద్యార్థులపై శ్రద్ధను అభినందించారు. విద్యార్థులు ఇలాగే మెరుగైన ఫలితాలను సాధించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మారయ్యగౌడ్, చంద్రశేఖర్, సంపత్‌కుమార్, ఆంజనేయులు, సంపత్, హరితగౌడ్, శ్యామ్ కుమార్, యూనుస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## బకాయి బిల్లులను చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ జిల్లాకు దాదాపు రూ. 8 కోట్ల బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. గత ఆగష్టు నెల నుండి మధ్యాహ్న భోజన కార్మికులు పిల్లలకు వంట చేసి పెట్టిన బిల్లులు కోట్ల రూపాయలలో రావాల్సి ఉందన్నారు. నిజామాబాద్ జిల్లాకు దాదాపు 8 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని, లేనియెడల సంక్రాంతి తర్వాత సమ్మెకు వెళతామని జిల్లా కలెక్టర్‌కి తెలిపారు. బహిరంగ మార్కెట్లో కోడిగుడ్డు ధర ఎనిమిదిన్నర రూపాయలు వుంటే ప్రభుత్వం ఆరు రూపాయలు ఇవ్వడం సరికాదని కిందిస్థాయిలో హెడ్మాస్టర్లు ఎంఈవోలు కక్షగట్టి మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కారణాలతో అకారణంగా తొలగిస్తున్నారన్నారు.

## పారుపల్లి లో సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన..!

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో అంగన్వాడి టీచర్ తిరుపతమ్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం,అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, ఉప సర్పంచ్ గోడ శ్యామల బాపు గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న చేశారు. అనంతరం సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ 7 నెలల నుండి 3 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలకు పౌష్టికాహారం బాలామృతం,గుడ్లు పంపిణీ చేయాలన్నారు.సర్పంచ్ చొప్పరి సంపత్, ఉప సర్పంచ్ బోడ శ్యామల బాపు గౌడ్, వార్డ్ సభ్యులు బోడ లక్ష్మి రాజయ్య, కావేటి నాగ భూషణం,



బోడ కృష్ణాకర్, నీలం రాజేందర్ రమ, ఇనుముల స్రవంతి రమేష్, దాసరి సతీష్, బత్తుల రాజమ్మ గట్టయ్య, స్కూలు హెచ్ ఎమ్ సదానందం, అంజయ్య,అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ వివో మీన, సి ఏ పద్మ,ఎ ఎన్ ఎం.రమాదేవి,ఆశ వర్కర్ విజయ, విద్యార్థులు తల్లిదండ్రులు, కార్యదర్శి రవీందర్ గ్రామ పంచాయతీ సిబ్బంది సుక్కమ్మ, కుమారస్వామి,రామకృష్ణ తో పాటు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లోనే చిన్నారులకు పోషకాహారం

ప్రజాపక్షం/ముత్తారం : అంగన్వాడి కేంద్రాల్లోనే చిన్నారులకు పోషకాహారం అందుతుందని సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్ అన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆవరణంలో అంగన్వాడి టీచర్లు లలిత, శోభా రాణి, లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసన్న, అక్షరాభ్యాసం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ అన్నపూర్ణ ఉపేందర్, ఉప సర్పంచ్ హరిత తిరుపతి తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి హాజరై మాట్లాడారు.గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఎంతో శ్రేయస్కర మన్నారు. నిరంతరం పోషణ ఆహార విలువలపై అవగాహన కార్యక్రమం కొనసాగించాలని, మెరుగైన పోషకాహారం, మంచి ఆరోగ్యం, పరిశుభ్రత పాటించాలన్నారు. వార్డు సభ్యులు సంపత్, ఏఎన్ఎం సునీత, అంగన్వాడీ టీచర్లు,పాటు చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు అంతర్జాతీయ ర్యాంకులు

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : విద్యార్థుల అకడమిక్ ప్రతిభను గుర్తించేందుకు వేసవికాలంలో నిర్వహించిన ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్(బెంగళూరు) పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు పతకాలు అందజేశారు.ఈ పరీక్షలో జంగంపల్లి సాత్విక( 9వ తరగతి )అంతర్జాతీయ ర్యాంకు 43 సాధించగా, చాట్ల శ్రీమాన్(8వ తరగతి )అంతర్జాతీయ ర్యాంకు 48 సాధించి విశిష్ట ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. విద్యార్థుల విజయాలు తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గనిర్దేశం వల్లే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులను నిర్వాహకులు,లు హృదయపూర్వకంగా అభినందించారు.



## మానసిక వికలాంగుల కేంద్రంలో అన్న ప్రసాద వితరణ

- సీనియర్ జర్నలిస్ట్ సామల హరికృష్ణ

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : మానసిక వికలాంగులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉంది అని సీనియర్ జర్నలిస్టు సామల హరికృష్ణ అన్నారు.సుల్తానాబాద్ సీనియర్ పాత్రికేయులు సామల హరికృష్ణ జన్మదినం పురస్కరించుకొని సుల్తానాబాద్ లోని మానసిక వికలాంగుల కేంద్రంలో గురువారం ఆయన అభిమానులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ తనపై అభిమానంతో తన జన్మదిన వేడుకలు పునరావాస మానసిక వికలాంగుల కేంద్రంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉంది అని అన్నారు. తనపై అభిమానంతో తన స్నేహితులు చేసిన విధంగా ప్రతి ఒక్కరూ వారి జన్మదిన వేడుకలకు హంగులు ఆర్భాటాలకు పోకుండా ఇలా మానసిక వికలాంగులకు అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.సామల రాజేంద్రప్రసాద్,దూడం లింగమూర్తి, వెంకటేశ్వర్లు, సాజిద్,తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాల కార్యక్రమం

ప్రజాపక్షం /సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పురపాలక సంఘం కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో గురువారం అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్ యందు ఏ ఎల్ ఎఫ్ అధ్యక్షులకు,ఓబీ మెంబర్లకు, రిసోర్స్ పర్సన్ లకు (ఉల్లాస్) అమ్మకు అక్షరమాల శిక్షణా కార్యక్రమ ము నిరఅసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వయోజన విద్యా శాఖ శ్రీనివాస్ , సి ఓ స్వరూప తో పాటు మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్.జి-3 జి.యం

ప్రజాపక్షం/రామగిరి : పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ని గురువారం నూతనంగా బాధ్యతలను స్వీకరించిన రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన్ మర్యాద పూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చాన్ని అందజేసి పరిచయం చేసుకున్నారు. సింగరేణి సంస్థ రామగుండం3 ఏరియా బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వారికి తెలియజేసి, ఏరియాలోని వివిధ గనుల విస్తరణలో భాగంగా భూసేకరణ కోసం సహాయ సహకారాలను అందించాలని వారిని కోరారు. అనంతరం ఎస్.డి.సి. బాణోత్ రాములు ని మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

## విద్య, నైపుణ్యాభివృద్ధికి ఎన్‌టిపిసి కృషి

ప్రజాపక్షం/గోదావరిఖని : విద్యార్థినిల్లో విద్య, నైపుణ్యాభివృద్ధితోపాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి సాధికారత కల్పనే లక్ష్యంగా ఎన్‌టిపిసి యాజమాన్యం కృషి చేస్తున్నదని.ఎం.ఎస్. అధ్యక్షురాలు రాఖీ సమంత అన్నారు. గురువారం రామగుండం ఎన్‌టిపిసి ఈడీసీ హాల్‌లో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్(జెమ్) శీతాకాల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.నెల రోజులపాటు జరిగే అభ్యాసం, సృజనాత్మక, విలువ ఆధారిత విద్య వంటి వాటిపై విద్యార్థినిల్లో నైపుణ్యాలను వెలికి తీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, జెమ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## బానిసలు కావొద్దు.. భవిష్యత్తు పాడు చేసుకోవద్దు..!

ప్రజాపక్షం/అంతర్గాం : డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దని మంచి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని పెద్దపల్లి డిసిపి బి.రామ్‌రెడ్డి అన్నారు. గురువారం అంతర్గాం మండల కేంద్రంలో గంజాయి, మత్తు పదార్థాలు, ట్రాఫిక్, షీ టీమ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

### ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ప్రజాపక్షం/కుంటాల : కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.గురువారం మండలంలోని కల్లూరు గ్రామ సర్పంచ్ పెంటవార్ దశరథ్,ఉప సర్పంచ్ నారాయణ రావు పటేల్,వార్డు సభ్యులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పక్క ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలన్నారు.గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.అనంతరం సర్పంచ్,ఉపసర్పంచ్,వార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

## పోచమ్మ వ్యాధి నివారణ టీకాల పంపిణీ

ప్రజాపక్షం/మోర్తాడ్‌: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం పోచమ్మ వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేస్తున్నట్లు మోర్తాడ్ పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ రాజు తెలిపారు. గురువారం మోర్తాడ్ మండలంలోని సుంకెట్ గ్రామంలోని మేకలు, గొర్రెలలో పోచమ్మ వ్యాధి రాకుండా ఉచితంగా వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశామని పశువైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సాత్విక్ రెడ్డి, వార్డు సభ్యుడు లింబాద్రి, గొర్రెల పెంపకందారులు నక్క లింబాద్రి, మేకల దుర్గయ్య, నూకల సాయన్న, నూకల సాయిరాం, పిట్ల దశరథ్, సంతోష్, మల్లేష్, పశువైద్య సిబ్బంది తేసీమ్, (పశువైద్య సహాయకుడు), ప్రభాకర్(హాస్పిటల్ అటెండర్), ప్రభాస్ పాల్గొన్నారు.

## కోర్టు గ్రహించి తనను అరెస్టు చేయవద్దని జడ్జిమెంట్ ఇచ్చింది

### ముత్యాల సునీల్ రెడ్డి

ప్రజాపక్షం/మోర్తాడ్‌: నేను కర్మ ఫలితాన్ని నమ్ముతా ఆ దైవం నాకు తోడుంది. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టే కోర్టు కేసును కొట్టివేసిందని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. కొంతమంది జీఎస్టీ అధికారులు అత్యుత్సాహం వల్లే తన సంస్థపై విచారణ జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో 12శాతం, అలాగే మిగతా రాష్ట్రాలలో ఐదు శాతం జీఎస్టీని బస్సుల మీద యధావిధిగా కట్టేవారమని కానీ మొత్తం మీద 12శాతం జీఎస్టీ కట్టాలని ఒత్తిడి చేశారని, దాని వల్ల 28కోట్లు అదనంగా జీఎస్టీ కట్టాలని తనపై, తన సంస్థపై విచారణ చేపట్టారని, విచారణ సందర్భంగా తనను అరెస్టు చేయాలని చూశారని కోర్టుకు వెళ్లే సరికి ఒక వ్యక్తిని కావాలని ఇబ్బంది పెడుతున్నారని కోర్టు గ్రహించి తనను అరెస్టు చేయవద్దని జడ్జిమెంట్ ఇచ్చిందని అన్నారు. ఆరెంజ్ ట్రావెల్స్ సంస్థ నిష్పక్షపాతంగా నిజాయితీగా ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులన్నీ కడుతుందని, ఇది కేవలం వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకు మాత్రమే విచారణ జరిగిందని ఆయన అన్నారు. విచారణ సందర్భంగా టీ న్యూస్, నమస్తే తెలంగాణ పత్రికలు తనను ఎక్కడికి తీసుకెళ్తే అక్కడికి వచ్చి విషయాన్ని రాజకీయం చేయాలని చూశాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీని నన్ను వ్యక్తిగతంలో బద్నాం చేయాలని చూశారని, కానీ అది సాధ్యపడలేదని, కోర్టు తీర్పు తరువాత వెంటపడ్డ టీవీ ఛానళ్లు, ఒక్కటి కూడ కనిపించకుండా మాయమయ్యాయని అన్నారు. కావాలని మాజీమంత్రి ప్రశాంత్ రెడ్డి గతంలోని తన పదవులను వాడుకొని వాటి టీవీ ఛానళ్లలో, బిఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయించారని కోర్టు తీర్పే వారందరికీ చెంపపెట్టు అయ్యిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ఇసుకను తక్కువ ధరకు అందిస్తే, వారి కళ్లు మండుతున్నాయని, వారి హయంలో ఆరు వేలకు తక్కువ ధరకు ఇసుక ఏనాడు ఇవ్వలేదని, ఇప్పుడు 3వేల లోపు ఇసుక వస్తే వారు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.

## ఎంపిడిఒ పాత భవనంలో కొనసాగించాలి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎంపీడీఓ కార్యాలయాన్ని పాత భవనంలోనే కొనసాగించాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని వేరేచోటకు తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల ప్రజలు ఎంపీడీఓ అనంతరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని 23 గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు మండల పరిషత్ కార్యాలయాన్ని వేరే చోటకు మార్చే ఆలోచన తక్షణమే విరమించుకోవాలని వివిధ గ్రామాల సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ప్రజలు వ్యతిరేకించారు. బస్టాండ్ ప్రాంగణంలో అందరికి అనువైన స్థలంలో ఉండాలని కోరారు.